

వీగిపోయిన అవిశ్వాసం

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై కొందరు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. 8లో



వేటాడకపోతే చేపలు గోవిందా..!

చెరువుమాధారం చెరువు నీటిమట్టం తగ్గడంతో అందులో ఉన్న దాదాపు 100 టన్నుల చేపలకు ప్రమాదం వాటిల్లనుంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి వాతావరణం మాత్రం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

వైరా: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఉపాధ్యాయ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వైరాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆ సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. తక్షణమే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న డీఏ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు తక్షణమే చేపట్టాలని, మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు మంజూరు చేయాలని కోరారు. 'మన ఊరు – మన బడి' పథకం కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో సృజనాత్మకత వెలికితీయొచ్చు

డీఈఓ సోమశేఖరశర్మ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, భయాన్ని తగ్గించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పదో తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ పట్టణ, మండల స్థాయిలో ఈనెల 15 నుంచి 17 వరకు పదో తరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్‌లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పర్వీన్, రాజు, సంగీత, వెంకటలక్ష్మి, శరణ్య, స్పందన, నవ్య, తరుణ్, వినోద్ పాల్గొన్నారు.

పాలేరుకు తగ్గిన ఇన్‌ఫ్లో

కూసుమంచి : జిల్లాలో తాగునీటి అవసరాల నిమిత్తం గత బుధవారం నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయగా శుక్రవారం పాలేరు రిజర్వాయర్‌కు చేరిన సంగతి తెలిసిందే. కాగా సాగర్ నుంచి రిజర్వాయర్‌కు ఆదివారం వరకు 4,100 క్యూసెక్కుల నీరు చేరగా రిజర్వాయర్ నీటిమట్టం 16.70 అడుగులు దాటింది. కాగా, సోమవారం సాయంత్రానికి 900 క్యూసెక్కులకు తగ్గించడంతో రిజర్వాయర్ 23 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరే అవకాశం లేకుండా పోతోంది. సాగర్ నుంచి కూడా తొలుత 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా దాన్ని సోమవారం 3,800 క్యూసెక్కులకు తగ్గించారు. దీంతో పాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని ఆయకట్టుకు నీటిని వినియోగించేందుకు అధికారికంగా ఆదేశాలు ఇవ్వటంతో పాలేరుకు వస్తున్న 3,900 క్యూసెక్కుల్లో 3వేల క్యూసెక్కుల నీటిని ఎగువన ఉన్న రెండు జిల్లాల ఆయకట్టుకు వినియోగిస్తున్నారు. దీంతో పాలేరుకు కేవలం 900 క్యూసెక్కుల మేరకే నీరు చేరుతోంది. ఈ సరఫరాను పెంచుతారా లేక పూర్తిగా నిలిపివేస్తారా అనేది వేచిచూడాలని అధికారులు తెలిపారు. కాగా రిజర్వాయర్‌కు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని ప్రకటించగా ఇప్పటి వరకు కేవలం 0.60 టీఎంసీల నీరు మాత్రమే చేరినట్లు అధికారులు చెబుతున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండకపోవటం, ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే కేటాయించటంతో పాలేరు కాలువ రైతుల పరిస్థితి ఏంటనేది అధికారులు తేల్చాల్సి ఉంది.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎంపీ నామ నాగేశ్వరరావు సీపీ సునీల్‌దత్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయ సిబ్బంది సీపీకి సోమవారం ఫిర్యాదు అందజేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన ప్రజల గుండెల నుంచి ఆ మహనీయుడిని తొలగించలేరని తెలిపారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయమై వెంటనే విచారణకు ఆదేశించి ఘటనకు కారకులైన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నామ కోరారు.

పోటెత్తిన మిర్చి



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

పంట కోత పెరగడంతో పుంజుకున్న విక్రయాలు

- మిర్చి బస్తాలతో మార్కెట్ కళకళ
- పలు జిల్లాలు, ఏపీ నుంచి విక్రయానికి తీసుకొచ్చిన రైతులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చి బస్తాలతో కళకళలాడింది. మార్కెట్ యార్డు నలుమూలలు మిరప బస్తాలతో నిండిపోయాయి. సోమవారం ఖమ్మం మార్కెట్‌కు దాదాపు 50 వేల మిర్చి బస్తాలు విక్రయానికి వచ్చాయి. శని, ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం విక్రయాలు పుంజుకున్నాయి. పంట కోతలు పెరగడంతో విక్రయాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఎర్ర మిర్చి 41,185 బస్తాలు, తాలు మిర్చి 5,230 బస్తాలు విక్రయానికి వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని మార్కెట్ కమిటీ లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన మిర్చి పంట డిసెంబర్ రెండో వారం నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదటి కోత పంట జనవరి నెల వరకు సాగింది. తొలికోత పంట మైల కాయ కావడంతో రైతులు ఆ పంటను ఎప్పటికప్పుడే విక్రయించారు. మొదటి కోత పంట అరకొరగా రావడంతో పాటు అంత నాణ్యత ఉండకపోవడంతో రైతులు నిల్వ పెట్టేందుకు ఆసక్తి చూపరు. ఇలా జనవరి నెల వరకు రైతులు మొదటి కోత పంటను విక్రయించారు. ప్రస్తుతం రెండో కోతలు ప్రారంభమయ్యాయి. ఈ పంట కొంత నాణ్యంగా ఉంటుంది. రెండో కోత పంట దిగుబడి కూడా కొంత మెరుగ్గానే ఉంటుంది. రెండో కోతలు కొనసాగుతున్న క్రమంలో విక్రయాలు కూడా పెరుగుతున్నాయి. జనవరి ఆరంభంలో రోజుకు 15 వేల బస్తాల చొప్పున మిర్చి విక్రయానికి రాగా, రెండో వారానికి 25 వేల బస్తాలకు పెరిగింది. మూడో వారానికి 30 వేల బస్తాలు, చివరి వారానికి 35 వేల బస్తాలు దాటాయి. ఇక ఫిబ్రవరి ఆరంభం నుంచి ఆ సంఖ్య 40 వేల బస్తాలకు చేరింది. నాలుగైదు రోజుల వ్యవధిలో 50 వేల బస్తాలు విక్రయానికి రావడం విశేషం.

పొరుగు జిల్లాలతో పాటు ఏపీ నుంచి..

తేజా మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్ పెట్టింది పేరు. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లు మిర్చి కొనుగోళ్లలో పేరుగాంచాయి. అయితే తేజా మిర్చికి మాత్రం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకం. దీంతో ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్‌తో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు మిర్చిని ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తేజా మిర్చి విదేశీ రకం కావడంతో ఎగుమతిదారులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను కేంద్రీకరించి కొనుగోళ్లు చేస్తుంటారు. విదేశీ ఆర్డర్లు ఉంటే వ్యాపారులు పంటను పోటీ పడి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్ విక్రయాలు అధికంగా సాగుతున్నాయి.

రూ. 21,600 పలికిన ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి జెండా పాట ధర రూ. 21,600గా పలికింది. మోడల్ ధర రూ.19,500గా నమోదైంది. ఇక కనిష్ట ధర రూ.14,000 ఉంది. జనవరి మూడు, నాలుగు వారాల్లో రూ. 21,000 నుంచి రూ. 21,300 వరకు గరిష్ట ధర పలకగా, ప్రస్తుతం రూ. 21,600 ఉంది. నాణ్యమైన పంట విక్రయాలు పెరగడంతో ధర కొంత మేర పుంజుకుంది. మొత్తంగా పంట నాణ్యత ఆధారంగా మోడల్ ధరల్లో పంట కొనుగోళ్లు జరిగాయి. ఇక తాలు మిర్చికి కూడా డిమాండ్ పెరిగింది. ఈ రకం గరిష్ట ధర రూ.12,000, మోడల్ ధర రూ. 11,000గా నమోదైంది. కనిష్ట ధర రూ. 8,000 పలికింది. రైతులు ఎప్పటికప్పుడు ధరలను పరిశీలిస్తూ మిర్చి విక్రయాలకు తీసుకొస్తున్నారు.

మెరుగైన వసతులతో వైద్య కళాశాల



మెడికల్ కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

- భవిష్యత్ అవసరాలను బట్టి నిర్మించాలి
- అధికారులకు మంత్రి తుమ్మల సూచన
- కలెక్టర్ గౌతమ్‌తో కలిసి తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం : భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంచి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి, కళాశాల స్థలం, వసతుల కల్పనను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ వి.పి.గౌతమ్‌తో కలిసి, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత కళాశాల ప్రభుత్వ ఆస్పత్రికి దగ్గరగా ఉందని, నూతన కలెక్టరేట్ నిర్మాణం పూర్తి కావడంతో పాత కలెక్టరేట్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేశామని చెప్పారు. రూ. 10 కోట్లతో పాత కలెక్టరేట్‌కు రెనోవేషన్ పనులు, వసతుల కల్పన చేపట్టి, మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండో సంవత్సరంలో మరో 100 మంది విద్యార్థులు రానున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుకూలంగా ఉందా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని సూచించారు. సుమారు రూ.166 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలకు వివిధ భవనాలు వస్తాయని, వాటన్నింటికీ అవసరమైన స్థలాలను ఎలా సర్దుబాటు చేయాలో ఆలోచించాలని చెప్పారు. కలెక్టర్, వైద్య కళాశాల అధికారులు ఈ మేరకు చర్చించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ రాములు నాయక్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.సరిత, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వర రావు, కళాశాల వివిధ విభాగాల అధికారులు ఎల్.కిరణ్ కుమార్, బి.బాబు రత్నాకర్, రాథోడ్ వినాయక్, ఎం.రాధిక, బి.దివ్యదర్శిని, డి.చండీప్రియ, జి.కరిష్మ, ఆర్ఎంఓలు బి.అమర్ సింగ్, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా 'భరోసా'

సీపీ సునీల్‌దత్



భరోసా కేంద్రాన్ని సందర్శిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం : లైంగిక దాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చి, పరిహారం ఇప్పించేవరకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని సీపీ సునీల్‌దత్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న భరోసా సెంటర్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్ట్, న్యాయాధికారి, పోలీసులు న్యాయ సహాయం చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలు ఈ కేంద్రం ద్వారా అందుతాయని వివరించారు. బాధితులు రాగానే ఎవరి పని వారు చేస్తూ సత్వర న్యాయం అందేలా కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, సీఐ అంజలి, ఎస్ఐ స్రవంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఫిర్యాదును విచారిస్తాం

బాధితుల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు.

అథ్లెట్‌కు కలెక్టర్ అభినందన



గౌతమ్‌తో కలెక్టర్ తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయస్థాయి ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించిన అథ్లెట్ గౌతమ్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం అభినందించారు. చెన్నైలో గత నెలలో జరిగిన ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో 200 మీటర్ల పరుగు పందెంలో గౌతమ్ రజత పతకం సాధించాడు. వరుసగా రెండోసారి ఖస్తలో ఇండియా టోర్నీలో పతకం సాధించడం పట్ల కలెక్టర్‌తో పాటు డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డీ. గౌస్ అభినందించారు.

19 నెలలకు గుర్తుకొచ్చింది!

- ఈ నెలలో ఐటీడీఏ పాలకమండలి భేటీ
- 10వ తేదీలోపు నిర్వహించాలని భావిస్తున్న అధికారవర్గాలు
- మూడు నెలలకోసారి జరపాల్సి ఉన్నా సమావేశాలకు తీవ్ర జాప్యం
- గిరిజన సంక్షేమంపై దృష్టిపెట్టకుండా మొక్కుబడిగా సాగుతున్న వైనం



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళికల రూపకల్పన, అమలుపై సమీక్ష నిర్వహించాల్సిన ఐటీడీఏ పాలక మండలి సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమావేశాలను ఏడాదికోసారి కూడా జరపడంలేదు. ఎప్పుడోసారి నిర్వహించినా అవి కూడా ప్రభుత్వ డప్పులుగా సాగుతున్నాయే తప్ప పెద్దగా ప్రయోజనం కలిగించడం లేదని గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడోసారి సమావేశం...

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో చిట్ట చివరి సమావేశం 2022, జూలై 8న నిర్వహించారు. ఇప్పటికీ 19 నెలలు గడిచింది. తాజాగా ఈ నెలలో సమావేశం నిర్వహించేందుకు ఐటీడీఏ అధికారవర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. చివరి సమావేశానికి 35 నెలల ముందు 2019, ఆగస్టు 13న సమావేశం నిర్వహించారు. ఇలా సమయ ప్రణాళిక లేకుండా పాలకవర్గాల సమావేశాలు సాగుతున్నాయి. ఈ నెలలో సమావేశానికి రంగం సిద్ధం చేసిన అధికారులు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. అందరి సమయం అనుకూలిస్తే ఈ నెల 10న నిర్వహించాలని భావిస్తున్నారు. ఒకవేళ అందరి సమయం దొరకకపోయినా, ఆలస్యమైనా... ఈ లోపు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో మళ్లీ కొద్ది రోజులు వాయిదా పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కోడ్ రాకముందే సమావేశం నిర్వహించాలని ఐటీడీఏ అధికారులు భావిస్తున్నారు.

ప్రగతి నివేదికలకే పరిమితం

సమావేశాల్లో గిరిజనుల అభివృద్ధికి అమలవుతున్న పథకాలపై చర్చించి, లోపాలు ఉంటే అధిగమించేలా, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడోసారి నిర్వహించే సమావేశాలు అధికారుల, మంత్రుల ప్రభుత్వ ప్రగతి నివేదికల సమర్పణకే పరిమితమవుతున్నాయని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. చివరి సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. నాడు గిరిజన మంత్రిగా పాల్గొన్న సత్యవతి రాథోడ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థులు, నిరుద్యోగుల కోసం స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇది అమలుకు నోచుకోలేదు. పోడు భూమి సాగు చేసుకుంటున్న గిరిజన రైతులందరికీ లక్ష ఎకరాలకు పోడు హక్కు పత్రాలు ఇస్తానని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. కానీ హక్కు పత్రాలు కొందరికే అందాయి. అప్పటి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చర్ల మండల కేంద్రంలో డిగ్రీ, వెంకటాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించేందుకు తీర్మానం చేయాలని కోరగా, ఇప్పటివరకు కనీసం కదలికలేదు.

పీఓ ప్రతీక్‌జైన్‌కు తొలి సమావేశం

భద్రాచలం ఐటీడీఏ పీఓ బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌కు ఇది తొలి సమావేశం. ఆయన బాధ్యతలు స్వీకరించాక విద్య, వైద్య శాఖల తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గిరిజనులకు ఇప్పపువ్వు ఆదాయ వనరుగా మార్చేందుకు 'ఇంటింటికి ఇప్పపువ్వు' కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేలా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలను గిరిజనుల దరి చేర్చటంలో ఐటీడీఏ కొంత వెనుకబాటుకు గురవుతోంది. దీనిపై పీఓ ఇప్పటివరకు తన మార్క్ చూపించలేకపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి తగిన నిధులను రప్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

కేబినెట్‌లో కీలకంగా ఉమ్మడి జిల్లా మంత్రులు

ఉమ్మడి జిల్లాకు చెందిన భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర కేబినెట్‌లో కీలకమైన శాఖల మంత్రులుగా బాధ్యతలను నిర్వరిస్తున్నారు. వీరు ఈసారి సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉండగా, తమ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతారని, మరిన్ని సంక్షేమ పథకాల అమలు, వాటికి నిధులు కేటాయింపు చేపడతారని గిరిజనులు ఆశిస్తున్నారు. ఆ దిశగా పీఓ ప్రతీక్‌జైన్ కూడా కృషి చేయాలని కోరుతున్నారు. కాగా చిత్తశుద్ధితో సమావేశాలను నిర్వహించి గిరిజనాభివృద్ధి ప్రణాళికలపై బహిరంగంగా చర్చ జరపాలని, అభిప్రాయ సేకరణ చేపట్టాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్ : ప్రజలు అందించిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, వీలైతే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ గణేష్, డీఆర్‌డీఓ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- ఖమ్మం నగరంలోని మామిళ్లగూడేనికి చెందిన ఓగిరాల వెంకటసుబ్బారావు తనకు కల్లూరు మండలం ముచ్చవరం రెవెన్యూ గ్రామ పంచాయితీ విశ్వనాధపురంలో సర్వే నం .291/ఇ/1, 292/ఈ/1లో రెండెకరాల వ్యవసాయ భూమి ఉందని, పడమర వైపున ఉన్న డొంకమార్గం ఆక్రమణకు గురైందని, ఆ డొంకను సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని కోరాడు.
- నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన నిమ్మరబోయిన రాములమ్మ తన భర్త 2019లో చనిపోయాడని, తాను వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు మంజూరు కాలేదని, పెన్షన్ ఇప్పించాలని కోరింది.
- కూసుమంచి మండలం జుజ్జుల్‌రావుపేట గ్రామానికి చెందిన దాట్ల నాగేశ్వరరావు తాను మాదిగ కులానికి చెందిన వికలాంగుడినని, చెప్పుల షాపు ఏర్పాటుకు 2021లో ఎస్సీ కార్పొరేషన్‌లో రుణానికి దరఖాస్తు చేసుకున్నానని, ఇంతవరకు మంజూరు కాలేదని, వెంటనే లోన్ ఇప్పించాలని కోరాడు.
- చింతకాని మండలం తిమ్మినేనిపాలెంకు చెందిన కొమ్ము రవి తాను దళితబంధు పథకం కింద మొదటి విడతగా గేదెల యూనిట్ ఎంచుకున్నానని, రెండో విడతలో గొర్రెల యూనిట్‌ను ఎంచుకోగా నేటికీ అందలేదని, గొర్రెలను మంజూరు చేయించాలని కోరాడు.
- నగరంలోని 20వ డివిజన్‌కు చెందిన పగిడిపల్లి నాగేశ్వరరావు తాను రజకుడినని, ఉచితంగా ఇచ్చిన విద్యుత్ మీటర్‌ను అకారణంగా తొలగించారని, తిరిగి పునరుద్ధరించాలని కోరాడు.

ఫస్ట్ లెవల్ చెకప్ ప్రారంభం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఈవీఎం యంత్రాల మొదటి స్థాయి తనిఖీల(ఫస్ట్ లెవల్ చెకప్)ను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు వచ్చిన 3,794 బ్యాలెట్ యూనిట్లు, 1,920 కంట్రోల్ యూనిట్లు, 2,263 వి.వి.ప్యాట్ల పనితీరును పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపడుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు జి. గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు పి.శ్రీనివాస్, జీఎస్ఆర్‌పి. విద్యాసాగర్, పున్నయ్య, ఆర్.ప్రకాష్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఫ్రాన్సిస్, వాసిరెడ్డి రామనాథం, కె. కరుణాకర్ పాల్గొన్నారు.

ట్రెసా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్లు రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంబూరు సునీల్ రెడ్డి, దొడ్డ పుల్లయ్య, నాయకులు కారుమంచి శ్రీనివాసరావు, తాళ్లూరి సుమ, స్వామి, బోడేపుడి రంజిత్, రామకష్ణ, బి. వెంకటేశ్వర రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, రెవెన్యూ సిబ్బంది వహీద్, రమేష్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 12న చేపట్టే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డివార్మింగ్ డే) పై వైద్యారోగ్య, విద్య, సాంఘిక సంక్షేమ, మున్సిపల్, మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 19 ఏళ్లలోపు బాల బాలికలకు నులిపురుగుల నివారణకు మందు పంపిణీకి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. చిన్నారులలో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలో 2,80,579 మంది 19 ఏళ్ల లోపు వారున్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్ర తప్పక వేయించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులతోపాటు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రలే వేయాలని ఆదేశించారు. ఎవరైనా మాత్ర వేసుకోని వారుంటే గుర్తించి ఈనెల 19న మాప్ అప్ రోజున వారికి ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డి.రాములు నాయక్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీఐఈఓ రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, వివిద శాఖల అధికారులు కె. సత్యనారాయణ, హరికిషన్, సుమ, విజయలక్ష్మి, జి.జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూవీ, టీవీ ఎన్నికల్లో బోనకల్ వాసి పోటీ



నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీనివాస్ రాథోడ్

బోనకల్: ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే మూవీ, టీవీ యూనియన్ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్‌గా బోనకల్ గ్రామానికి చెందిన బుల్లితెర సినీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ రాథోడ్ పోటీ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. గత మూవీ అసోసియేషన్ ఎన్నికల్లోనూ శ్రీనివాస్ ఈసీ మెంబర్‌గా ఎన్నికయ్యారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కమెడియన్ పృథ్వీరాజ్, శుభోదయం సుబ్బారావు, కొత్తరంగుల ప్రపంచం హీరోయిన్ శ్రీలు తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

సీపీ సునీల్‌దత్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంక్రైం : దాబాలలో మద్యం విక్రయించినా, మద్యం సేవించడానికి అనుమతి ఇచ్చినా దాబాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను సీపీ సునీల్‌దత్ ఆదేశించారు. 'సాక్షి'లో సోమవారం 'అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా దాబాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దాబాలు రాత్రి 10 గంటల వరకు మూసేసేలా చూడాలని, అల్లరి మూకలు, అకతాయిలకు దాబాల్లో అనుమతి ఇవ్వకూడదని ఆదేశాలు జారీ చేశారు.

దాడి ఘటనలో 11 మంది అరెస్ట్

ఖమ్మంక్రైం: జిల్లా ఆస్పత్రిలో ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఖమ్మం రూరల్ ఎస్సై సురేశ్‌కుమార్‌పై దాడి చేసిన సంఘటనలో నగరానికి చెందిన 18 మందిపై కేసులు నమోదైన విషయం విదితమే. అందులో భాగంగా టూటౌన్ సోమవారం రేవతి థియేటర్, నెహ్రూనగర్, గట్టయ్యసెంటర్ ప్రాంతాలకు చెందిన 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగతా 7గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అరెస్టయిన వారిలో కొల్లి ఉదయ్, కుమ్మరి విజేత, పగిడికతుల ప్రశాంత్, పేర్నాగి ఉపేందర్, దుంగ్రోత్ హుస్సేయన్, కొల్లి అభినయ్, చిలపాక వినయ్, మంద సుబ్రహ్మణ్యం, బుడిగ అశోక్, గుజులూరి వినోద్‌కుమార్, లింగపోగు దిలీప్‌లు ఉన్నారు. మిగతా వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని టూటౌన్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం అగ్రహారం కొత్తూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోతురాజు సాయిరాం అదృశ్యమైనట్లు ఆయన తండ్రి నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడేనికి చెందిన సాయిరాం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 4న హైదరాబాద్ నుంచి కొత్తూరులో ఉన్న పెద్దమ్మ నాగమణి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడని, ఫోన్ స్విచాఫ్ వస్తోందని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లంపాడు వాసికి అరుదైన గౌరవం



పురస్కారం అందుకుంటున్న వీరబ్రహ్మాచారి

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడుకు చెందిన మునగంటి వీరబ్రహ్మాచారికి అరుదైన నంది పురస్కారం లభించింది. కోలాటం విభాగంలో ఉత్తమ శిక్షణకు గాను అత్యుత్తమ కోలాటం మాస్టర్‌గా ఎన్నికైన ఆయనకు హన్మకొండలో విశ్వకర్మ సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందజేశారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్ : నిరుద్యోగ యువతకు ఈనెల 7న నగరంలోని టేకులపల్లి మోడల్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్‌లో ఖమ్మం, హైదరాబాద్ కేంద్రాల్లో పని చేయుటకు 80 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు ఉండి, పది, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని వివరించారు. యాక్సిస్ బ్యాంక్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వేతనం రూ. 18 నుంచి రూ.30 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

వీగిపోయిన అవిశ్వాసం

- పాలకవర్గంలో 24 మంది సభ్యులకు 15 మంది మాత్రమే హాజరు
- సమావేశానికి ముందు చేజారిన ఇద్దరు కౌన్సిలర్లు
- కోరం లేకపోవడంతో వీగిపోయినట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి
- ఇల్లెందు మున్సిపాలిటీలో ముగిసిన అవిశ్వాస పోరు



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. అసమ్మతి కౌన్సిలర్ల ప్రయత్నం బెడిసి కొట్టింది. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశ సమయానికి 15 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 24 మంది సభ్యులు ఉండగా 9 మంది గైర్హాజరయ్యారు. కోరం పూర్తికావడానికి 17 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, 15 మంది మాత్రమే హాజరు కావడంతో, కోరం లేక అవిశ్వాసం అర్థంతరంగా వీగిపోయింది. ఉదయం 11 గంటలకు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగా, పక్కనే పెన్షనర్ భవన్‌లో తలదాచుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు బయటకు వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే క్రమంలో అక్కడే వేచి ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు 3వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావును మాట్లాడేది ఉందంటూ ఎదురుగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలోకి లాక్కెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయం వెనుక ద్వారం నుంచి బయటకు తీసుకెళ్లి వాహనంలో తరలించారు. సీపీఐకి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి రవీందర్‌ను పెన్షనర్ భవన్ నుంచి బయటకు లాక్కుని వచ్చారు. పోలీసులు అడ్డుకోవటంతో వదిలేశారు. అప్పటికే మున్సిపల్ కార్యాలయంలో వేచి ఉన్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అతనితో మాట్లాడగా, కార్యాలయం వెనుక గోడ దూకి వెళ్లిపోయారు. కోరం లేకపోవడంతో అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మున్సిపల్ కార్యాయలం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ఇల్లెందు, కొత్తగూడెం డీఎస్పీలు రమణమూర్తి, అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోరం లేక..

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవిశ్వాసం వీగిపోయిందని ఎన్నికల అధికారి, ఆర్డీఓ శిరీష తెలిపారు. ఎన్నిక ప్రక్రియ 11 గంటలకు ప్రారంభమైందని, పాలకవర్గ సభ్యులు 24 మందిలో 17 మంది హాజరు కావాల్సి ఉండగా, 15 మంది మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్తున్న సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్

రెండు దఫాలు సమావేశపర్చినా కోరం పూర్తికాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

- మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యునిగా నమోదు చేసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య అవసరమైతే ఓటింగ్‌లో పాల్గొనాలని మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. అయితే కనకయ్య అక్కడకు రాగానే సీన్ అంతా మారిపోయింది. కాగా మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగిన సంఘటనలతో తనకు సంబంధం లేదని, తాను ఓటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చానని ఎమ్మెల్యే చెప్పారు.
- పోలీస్ బందోబస్తు కోసం కోర్టును ఆశ్రయించిన కౌన్సిలర్లు రాత్రి పెన్షనర్ భవన్ లోనే ఉన్నారు. కనీసం పోలీసులకు కూడా సమాచారం ఇవ్వలేదు. అక్కడి నుంచి ఉదయం పరుగులు తీస్తూ మున్సిపల్ ఆఫీస్‌లోకి చేరే క్రమంలో అధికార పక్షం ఒకరిని, కార్యాలయం ఆవరణలోకి చేరిన తర్వాత సీపీఐ తన సభ్యుడిని పట్టుకుంది. దీంతో ఇద్దరు సభ్యులు తగ్గిపోయారు.
- 3వ వార్డు కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును అధికార పార్టీ నేతలు కిడ్నాప్ చేశారని, తమకు అప్పగించాలని ఆయన భార్య వెంకటలక్ష్మి, కుమార్తె సరిత ఆందోళన చేపట్టారు.
- పట్టపగలు పోలీసుల ముందే తమ పార్టీ సభ్యులను కిడ్నాప్ చేశారంటూ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కౌన్సిలర్లతో కలిసి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మెలే కోరం కనకయ్య, చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ నాగరత్నమ్మ, ఆమె భర్త జానీ, కాంగ్రెస్ జిల్లా, పట్టణ నాయకులు జానీ, డానియేల్ మీద ఫిర్యాదు చేశారు.
- క్యాంపునకు వెళ్లినా తనకు పార్టీ ముఖ్యమని, పార్టీ ఆదేశాలతోనే సమావేశానికి గైర్హాజరయ్యానని సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ తెలిపారు.

ఎమ్మెల్యే కనకయ్యపై కేసు నమోదు

తన భర్తను కిడ్నాప్ చేశారంటూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు 17 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మున్సిపల్ అవిశ్వాసం సందర్భంగా తన భర్త నాగేశ్వరరావును సమావేశానికి వెళ్లకుండా అడ్డుకుని కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదైన వారిలో ఎంపీపీ నాగరత్నమ్మ, ఆమె భర్త జానీ, పెద్దయ్య, కోరం సురేందర్, పింగళి నరేష్, సుధాకర్, మెరుగు కార్తీక్, శ్రావణ్, ఎస్కె జానీ, ఈసం లక్ష్మణ్, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, భార్గవ్, మండల రాము ఉన్నారని తెలిపారు.

ఉన్న పథకాలనైనా అమలు చేయండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 60 రోజులు అవుతున్నా ఇచ్చిన ఆరు గ్యారంటీల వాగ్దానాలను అమలు చేయడం లేదని, అమలు చేస్తున్న రెండు గ్యారంటీలు కూడా పావు వంతేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. కొత్తవి అమలు కాకున్నా.. ప్రజలకు పాత పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని, ఇదే ప్రజలు అడుగుతున్నారని అన్నారు. జనవరిలో ఇవ్వాల్సిన పెన్షన్ ఇప్పటి వరకు అందలేదని, రైతు బంధు మూడెకరాల లోపు వారికే పడిందని చెప్పారు. వ్యవసాయానికి కరెంట్ సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ కొన ఊపిరిలో ఉందని, ఇండియా కూటమి నుంచి ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని అన్నారు. ఆ పార్టీ మునిగిపోయే పడవ లాంటిదని ఎద్దేవా చేశారు. తాము బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా పని చేస్తామని, ప్రజల తరపున నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు రాకేష్‌రెడ్డి, కొల్లు పద్మ, తాళ్లూరి జీవన్‌కుమార్, దోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేటాడకపోతే 100 టన్నులు చేప గోవిందా!

- 2-3 అడుగులకు చేరిన నీటిమట్టం
- మూడేళ్లుగా కొనసాగని చేపల వేట
- మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు చెరువును పరిశీలించిన ఏడీ



అడుగంటిన చెరువును పరిశీలిస్తున్న ఏడీ ఆంజనేయస్వామి

నేలకొండపల్లి: జిల్లాలోనే పెద్ద చెరువుల్లో చెరువు మాధారం చెరువు ఒకటి. ప్రస్తుతం ఆ చెరువు 2-3 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. దీంతో చేపల వేట చేయకుంటే దాదాపు 100 టన్నుల చేప చనిపోయే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చెరువుపై మంగాపురంతండా, రాయగూడెం, రాజారాంపేట, చెరువుమాధారం గ్రామాలకు చెందిన దాదాపు 832 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. గత మూడేళ్లుగా వివిధ కారణాలతో మత్స్యకారులు చేపల వేట సాగించలేదు. ఈ ఏడాది చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చేపల వేట సాగించేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ అనుమతి కోసం రూ.4 లక్షల ఫీజు కూడా ప్రభుత్వానికి చెల్లించారు. ఈనేపథ్యాన చెరువుమాదారం చెరువులో చేపల వేటను సాగించేందుకు అనుమతి ఇవ్వాలని మత్స్యశాఖ ఏడీ డి.ఆంజనేయస్వామిని ఆశ్రయించారు.

చెరువును పరిశీలించిన ఏడీ..

చెరువులో నీటి మట్టం పరిస్థితిని తెలుసుకునేందుకు సోమవారం ఏడీ ఆంజనేయస్వామి నాటు పడవలో సొసైటీ పాలకవర్గం ప్రతినిధులతో కలిసి నీటి కొలతలు తీసుకున్నారు. పలుచోట్ల 2 అడుగులు, మరికొన్ని చోట్ల మూడు అడుగులు నీటి సామర్థ్యం ఉన్నట్లు ఏడీ తెలిపారు. ఈ సందర్భంగా చేపల వేట సాగించకుంటే తామంతా తీవ్రంగా నష్టపోతామని మత్స్యశాఖ అధికారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, చెరువుమాధారం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డి, తేజావత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు..

- పాతర్లపాడులో రెండు చోట్ల దొంగతనాలు
- నగదు, బంగారు ఆభరణాల అపహరణ



ఇటీవల తెట్టెలపాడులో మిర్చిని ఎత్తుకెళ్లడంతో సగం ఖాళీ అయిన కుప్ప (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. నిన్నామొన్నటి వరకు మిర్చి కల్లాలు, పెట్రోల్ బంకుల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. దీంతో ప్రజలు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని పాతర్లపాడులో ఆదివారం అర్ధరాత్రి షేక్ యాకూబ్‌బీ అనే మహిళ కిరాయి ఇంట్లో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.15వేలతో పాటు రూ.28 వేల విలువైన ఆరు గ్రాముల వెండి పట్టీలు, 3గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో శంకర్ అనే వ్యక్తి డబ్బా కొట్టు తాళాలు పగుల గొట్టి అందులోని నగదు, మద్యం సీసాలు, పెట్రోల్ ఎత్తుకెళ్లారు. పాతర్లపాడు స్టేజీ వద్ద గల ఓ మెడికల్ షాపు షట్టర్ తొలగించారు. మండలంలోని తెట్టెలపాడులో ఇటీవల పుసులూరి సురేష్ అనే రైతు కళ్లంలో మిర్చి రాసి పోసి ఉంచగా ఆటోలో వచ్చిన దుండగులు సుమారు 10 క్వింటాళ్ల మిర్చిని ఎత్తుకెళ్లారు. పిండిప్రోలులో కూడా రాష్ట్రీయ రహదారి వెంట మిర్చి కళ్లాల్లోని మిర్చిని దొంగిలించేందుకు ప్రయత్నించగా రైతులు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. ఆదివారం రాత్రి కూడా మిర్చిని ఎత్తుకెళ్లేందుకు రాగా రైతులు కేకలు వేయడంతో పరారయ్యారు. పాపాయిగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో ప్రారంభం కాని పెట్రోల్ బంక్‌లో కూడా భారీగా డీజిల్ ఎత్తుకెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాటు సారాపై ఉక్కుపాదం..



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కూసుమంచి: నాటుసారాపై ఉక్కుపాదం మోపుతామని నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ పోశెట్టి అన్నారు. సోమవారం మండలంలోని బికారితండా, మంగళితండా, భగవత్‌వీడు తండాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్సై రాధాకృష్ణ ఆధ్వర్యాన సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 200 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసి నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో సారా తయారీదారుల సమాచారాన్ని అందించాలన్నారు. గుడుంబా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. నాటుసారా తయారీదారులు, బెల్లం విక్రయదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు : నలుగురిపై కేసు నమోదు



సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసిన అధికారులు

నేలకొండపల్లి : స్థానిక ఎక్సైజ్ సర్కిల్‌లో అధికారులు సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపిన వివరాల ప్రకారం.. సర్కిల్ పరిధిలోని శంకరగిరితండా, బికారితండా, మంగలితండా, భగవత్‌వీడు తండాలలో పలు చోట్ల అక్రమంగా సారా తయారీ చేస్తుండగా, మరికొందరు బెల్లం పానకం సిద్ధం చేశారు. సమాచారం అందడంతో ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి 200 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 8 లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎక్కడైనా సారా విక్రయించినా, తయారు చేసిన సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. దాడులలో ఎస్సై రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి చెంతకు చిన్నారి



అక్షయను తల్లికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు, సిబ్బంది

మధిర: విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో తప్పిపోయిన చిన్నారి రైల్వే పోలీసులు, సిబ్బంది సహకారంతో ఎట్టకేలకు తల్లి చెంతకు చేరింది. మధిరలో ఈనెల 6 నుంచి కల్వరి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో స్వచ్ఛందంగా పనిచేసేందుకు తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన కొమెర బోయిన రమేష్, వనజ దంపతులు వారి కుమార్తె అక్షయ(5)ను తీసుకుని ఆదివారం రాత్రి ఖమ్మం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మధిర రైల్వేస్టేషన్‌లో దిగే ముందు లగేజీ మాత్రమే దింపి చిన్నారిని కిందకి దింపడం మర్చిపోయారు. రైలు కదిలిన తర్వాత చిన్నారిని చూస్తే కనిపించలేదు. రైల్వే పాయింట్స్ మెన్ కృష్ణ సహాయంతో స్టేషన్ మాస్టర్ సల్మాన్ అబ్బాస్‌కు ఈ విషయం చెప్పారు. దీంతో ఆయన రైల్వే పోలీస్ మాతంగి వెంకటేశ్వర్లుకు చెప్పి పాప ఫొటోని పంపించారు. తర్వాత వచ్చే రాయనపాడు స్టేషన్ మాస్టర్‌కు అక్షయ గురించి చెప్పారు. కాగా, రైలులో తప్పిపోయి రోదిస్తున్న చిన్నారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది రాయనపాడు స్టేషన్ మాస్టర్‌కు అప్పగించారు. ఆ తర్వాత చిన్నారిని మధిర రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి రైల్వే పోలీసులు, సిబ్బంది సహకారంతో తల్లిదండ్రులకు అప్పగించారు. సుమారు రెండు గంటలపాటు వారి కుమార్తె కోసం తల్లిదండ్రులు రైల్వే స్టేషన్‌లో తీవ్రంగా రోదించారు. ఎట్టకేలకు రైల్వే పోలీసులు, సిబ్బంది సకాలంలో స్పందించి చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: ఓ బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన జి.గోపి తన అక్క ఉమతో కలిసి సోమవారం బైక్‌పై కోదాడ వెళ్తున్నారు. ఈక్రమంలో ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న కారు కొత్తకొత్తూరు వద్దకు రాగానే ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రి, ఆ తర్వాత ఖమ్మంకు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెరువుమాధారంకు చెందిన నాగమణి(22) హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి వచ్చేందుకు కోదాడ నుంచి తన తమ్ముడితో కలిసి బైక్‌పై వస్తోంది. ఈక్రమంలో మండలంలోని పైనంపల్లి వద్దకు రాగానే ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. దీంతో నాగమణికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగొండ : ద్విచక్ర వాహనం పైనుంచి కిందపడి ఒకరికి గాయాలైన ఘటన ముదిగొండలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురానికి చెందిన ఉపేందర్ ద్విచక్రవాహనంపై ఖమ్మం వైపు వెళ్తుండగా ముదిగొండ ప్రధాన సెంటర్‌లో ఓ వ్యక్తిని తప్పించబోయి ద్విచక్రవాహనంపై నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మం తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని మరో వాహనం ఢీకొని నాయుడుపేటకు చెందిన అమృతపు వెంకటేశ్వర్లు(38) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వెంకటేశ్వర్లు, డి. కృష్ణ కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం వైపు వెళుతుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన వాహనం బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుతాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మృతుడి సోదరుడు సాయిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కాచిరాజుగూడెంలో..



ఎండీ. జానీమియా (ఫైల్)

మండలంలోని కాచిరాజుగూడెం వద్ద ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన ఎండీ. జానీ(45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జానీ ద్విచక్రవాహనంపై ములకలపల్లి వెళ్లి తిరిగి ఖమ్మం వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందాడు. మృతుడు ఖమ్మంలోని డిపో రోడ్‌లో పాన్‌షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న కౌలు రైతు...

కామేపల్లి: చికిత్స పొందుతూ కౌలు రైతు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాస్పురం గ్రామానికి చెందిన ధారావత్ నెహ్రూ (36) మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేయగా దిగుబడి సరిగా రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన నెహ్రూ ఈనెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నెహ్రూకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.